ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 15.09.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ఈ మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరిస్తారు.
2. వర్షాలు, వరదలకు పంట నష్టపోయిన వారి ఖాతాల్లో ఎకరాకు 10 వేల రూపాయలు చొప్పున త్వరలోనే జమ చేస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు.
3. హైదరాబాద్లో ఐటీ, అనుబంధ పరిశ్రమలకు కేటాయించడానికి ఉద్దేశించిన భూమిని ప్రభుత్వం ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలకు తాకట్టు పెట్టాలని చూస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ఆరోపించారు.
4. జంటనగరాల్లో మంగళవారం జరిగే గణేశ్ నిమజ్జనం కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## ప్రదేశ్ కాంగ్రెస్

తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ఈ మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరిస్తారు. గాంధీభవన్ లో జరిగే కార్యక్రమంలో ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి మహేశ్ కుమార్ గౌడ్ పదవీ బాధ్యతలు తీసుకుంటారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి దీపాదాస్ మున్షి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమం లో పాల్గొంటారు. కొద్ది సేపటి క్రితం అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్ పార్క్ అమరువీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించిన అనంతరం మహేశ్ కుమార్ గౌడ్ భారీ ఊరేగింపుతో గాంధీ భవన్ కు బయలు దేరారు. పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు

ఆయన వెంట ఉన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతల స్వీకరణ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హైదరాబాద్ నగర వ్యాప్తంగా భారీ సంఖ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దాదాపు అన్ని ప్రధాన కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. (DESK)

**పొంగులేటి**

ప్రకృతి విపత్తుల సమయంలో కేంద్ర సాయం కోసం ఎదురుచూడకుండా రాష్ట్రస్థాయిలో ప్రత్యేక బృందాల ఏర్పాటుకు యోచిస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందుకోసం ప్రతి పోలీస్ బెటాలియన్ నుంచి 100 మందికి విపత్తు నిర్వహణలో శిక్షణ ఇస్తామని మంత్రి చెప్పారు. వర్షాలు, వరదలకు పంట నష్టపోయిన వారి ఖాతాల్లో ఎకరాకు 10 వేల రూపాయలు చొప్పున త్వరలోనే జమ చేస్తామని చెప్పారు.

**క్యాబినెట్**

తెలంగాణ మంత్రివర్గం ఈనెల 20న సమావేశమవుతుంది. ఈ సమావేశంలో కొత్త రేషన్ కార్డుల జారీకి విధివిధానాలను ఖరారు చేసే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అలాగే హైడ్రాకు చట్టబద్ధత కల్పించడం, వరద నష్టం, హెల్త్ కార్డులు, రైతు భరోసా, విద్య, రైతు కమిషన్ తదితర అంశాలపై మంత్రివర్గం చర్చించే అవకాశం ఉంది.

(DESK)

**ఇరిగేషన్ నష్టాలు**

రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు 773 చోట్ల చెరువులు, కాల్వలకు గండ్లు పడినట్లు నీటిపారుదల శాఖ గుర్తించింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని వట్టెం పంప్ హౌస్, భక్త రామదాసు ఎత్తిపోతల పథకంలోని పంప్ హౌస్ మునిగిపోయాయని తెలిపింది. వీటి తాత్కాలిక మరమ్మతులకు 75 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు 483 కోట్ల రూపాయలు అవసరమని అంచనా వేసింది. ఈ మేరకు కేంద్రానికి నివేదిక అందించింది.

(DESK)

**KTR**

హైదరాబాద్లో  ఐటీ, అనుబంధ పరిశ్రమలకు కేటాయించడానికి ఉద్దేశించిన భూమిని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలకు తాకట్టు పెట్టాలని చూస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ఆరోపించారు. సుమారు 400 ఎకరాల భూమిని తాకట్టు పెట్టి 10 వేల కోట్ల రూపాయల రుణాన్ని తీసుకోవడానికి ప్రభుత్వం యత్నిస్తోందని ఆయన అన్నారు. నగరం చుట్టుపక్కల ఐటీ, అనుబంధ రంగాల పరిశ్రమలు వచ్చి, తెలంగాణ యువతకు ఉద్యోగాల కల్పన జరగాలి కానీ, ఈ భూములు తాకట్టు పెడితే కొత్త పరిశ్రమలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. **(X)**

**సిరిసిల్ల- బైట్**

ఇటీవల కురిసిన  భారీ వర్షాల నేపథ్యంలో పంటల్లో చీడ పీడల వ్యాప్తిఎక్కువగా ఉన్నందున రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల వ్యవసాయధికారి దుర్గారాజు  సూచించారు. ఆయన ఆకాశవాణి ప్రతినిధి రాచర్ల లక్ష్మీనారాయణతో  మాట్లాడుతూ....(PTC) BYTE

**షెడ్యూల్ బైట్-ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 100 శాతం విద్యుత్ సౌకర్యం ఉన్నట్లు జిల్లా విద్యాధికారి అశోక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు జీవో విడుదల చేసిన నేపథ్యంలో జిల్లాలోని పాఠశాలల వివరాలు,  విద్యుత్ కనెక్షన్ల పరిస్థితి పై నివేదిక సమర్పించామని అశోక్ ఆకాశవాణికి చెప్పారు. **(PTC) బైట్**

**నిమజ్జనం**

జంటనగరాల్లో మంగళవారం జరిగే గణేశ్ నిమజ్జనం కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నిమజ్జన సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అందరూ కలిసి సమన్వయంతో ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా చూడాలని మంత్రి పిలుపునిచ్చారు. నిమజ్జన కార్యక్రమాల్లో ఇబ్బందులు కలిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. శాంతిభద్రతలకు ఎవరైనా భంగం కలిగిస్తే కఠిన చర్యలు

తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జనం రోజున 25 వేల మంది పైగా పోలీసులు బందోబస్తు విధుల్లో ఉంటారని హైదరాబాదు పోలీస్ కమిషనర్ సి వి ఆనంద్ తెలిపారు. నిమజ్జనం శోభాయాత్ర కోసం బాలాపూర్- హుస్సేన్ సాగర్ మధ్య ముఖ్యమైన కూడళ్లను గుర్తించామని కమిషనర్ తెలిపారు. ఖైరతాబాద్ లోని 70 అడుగుల భారీ గణేశుని నిమజ్జనం మంగళవారం మధ్యాహ్నానికే పూర్తి అయ్యేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఖైరతాబాద్ గణేశుని దర్శనానికి నేడు చివరి రోజు కావడంతో ఉదయం నుంచి ప్రజలు భారీగా తరలి వస్తున్నారు. కాగా జి హెచ్ ఎం సి పరిధిలోని చెరువుల్లో కూడా గణేశ విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కమిషనర్ ఆమ్రపాలి చెప్పారు. ఇలా ఉండగా నిమజ్జనం కోసం గణేశ విగ్రహాలను తరలించడానికి 25 వేల వాహనాలను సిద్ధం చేశామని, మండపాల నిర్వాహకులు వీటిని తీసుకోవచ్చని ఆర్ టి ఎ అధికారులు చెప్పారు. **(DESK)**

**గణేశ్ ఉత్సవ సమితి**

ట్యాంక్ బండ్ పై వినాయక నిమజ్జనం లేదంటూ పోలీసులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను, బారికేడ్ల ను భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి నేతలు తొలగించారు. ట్యాంక్ బండ్ పై ఏర్పాటుచేసిన జాలీలను తొలగించి వినాయకుని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ట్యాంక్ బండ్ పై వినాయక నిమజ్జనం అనేక సంవత్సరాలుగా జరుగుతోందని, ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకువచ్చిభక్తుల మనోభావాలు దెబ్బ తీస్తోందని ఆరోపించారు. (PTC)

**నిమజ్జనం- భద్రాద్రి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గణేష్ నిమజ్జన కోలాహలం నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి గణేశ విగ్రహాలను భద్రాచలం వద్ద గోదావరి నదిలో నిమజ్జనం చేసేందుకు భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. గోదావరి కరకట్ట వద్ద గణేష్ నిమజ్జోత్సవం జరిగే ప్రదేశాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజా ఐపిఎస్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

**(PTC)**

**నిమజ్జనం- కరీంనగర్**

కరీంనగర్ లో మానకొండూరు చెరువు వద్ద రేపు జరిగే గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వందలాది గణేష్ విగ్రహాలను రేపు మానకొండూరు , కొత్తపల్లి , చింతకుంట చెరువులలో నిమజ్జనం చేయనున్నట్టు మంత్రి తెలిపారు. (PTC)

**నిమజ్జనం- వరంగల్**

గ్రేటర్ వరంగల్ పరిధిలో వినాయక నిమజ్జనం సందర్భంగా రేపు ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్టు పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. విగ్రహాలను తరలించే మార్గాల్లో ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్టు పోలీస్ కమిషనర్ తెలిపారు. **(PTC)**

**నిమజ్జనం- నల్గొండ**

నల్లగొండ జిల్లాలో రేపు నిర్వహించే గణేష్ నిమజ్జన శోభాయాత్ర కు అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశామని ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. అన్ని గణేష్ విగ్రహాలు, మండపాలకు జియో ట్యాగింగ్ చేశామని చెప్పారు. విగ్రహాల సైజులని బట్టి నల్లగొండ సమీపంలోని కొన్ని చెరువులతో పాటు సాగర్ ఎడమ కాలువ, నాగర్జున సాగర్ దయ్యలగండి వద్ద నిమజ్జనాలకు ఏర్పాట్లు చేసి, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామని చెప్పారు. **(PTC)**

**తెలంగాణ భవన్**

రాష్ట్రంలో వెంటనే మెడికల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మినిస్టర్ క్వార్టర్స్ ముట్టడికి బయలుదేరిన బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులను తెలంగాణ భవన్ ముందు పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, విద్యార్థి విభాగం నేతలకు తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు పెద్ద ఎత్తున

నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

(DESK)

**నల్లగొండ**

నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఏకశిల అడ్వాన్స్డ్ లెర్నింగ్ స్కూల్లో సీబీఎస్ఈ 7వ క్లస్టర్ అథ్లెటిక్స్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సుమారు 300 లకు పైగా పాఠశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొంటున్న ఈ పోటీలను గనులు, భుగర్భశాఖ కార్యదర్శి కే. సురేంద్రమోహన్, ఏకశిల విద్యాసంస్థల ఛైర్మన్ గౌరు తిరుపతి రెడ్డి ప్రారంభించారు.